క్లుప్తంగా

వైద్య సేవలకు గుర్తింపు

సీతంపేట: గిరి ప్రదక్షిణ, యోగాంధ్రలో సేవలందించిన డాక్టర్ రామారెడ్డి, వ్యాధి నిరోధక టీకాలు అందించడంలో ప్రణాళిక బద్ధంగా లక్ష్యాన్ని చేరుకున్న డాక్టర్ లూసీ, ఎన్‌సీడీ సర్వేలో ప్రతిభ చూపిన డాక్టర్ హారిక, అలాగే అధికారులు పి.శ్యామ్‌ప్రసాద్, సత్యనాథ్, వెంకటరావు, మణికుమారి, శివాజీ, రామలక్ష్మి రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

సత్యానంద్ సేవలకు గుర్తింపు


మంత్రి సత్యప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సత్యానంద్

సీతంపేట: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా మలేరియా విభాగంలో ఉత్తమ సేవలందించిన హెల్త్ సూపర్‌వైజర్ (ఎంపీహెచ్‌ఎస్) పడిమి వెంకట సత్యానంద్ రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి తులసి, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, ఎంపీహెచ్‌ఈవోలు వెంకటేష్, నాగశ్రీను, సహచర సిబ్బంది సత్యానంద్‌ను అభినందించారు.

రహదారికి మోక్షం


బీటీ రోడ్ నిర్మాణం జరుగుతున్న శ్రీనగర్ రోడ్డు

సీతంపేట: జీవీఎంసీ 27వ వార్డు రామా టాకీస్ రోడ్ నుంచి వీటీ హైస్కూల్ మీదుగా ద్వారకానగర్‌కు వెళ్లే శ్రీనగర్ రోడ్‌లో ఎట్టకేలకు బీటీ రోడ్ నిర్మాణం జరుగుతోంది. శ్రీనగర్ రోడ్ గోతులతో రాళ్లు తేలి అధ్వానంగా మారింది. చాలా కాలంగా వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మూడు నెలల్లో రహదారులను బాగు చేస్తామని హామీ ఇచ్చారు. అయినా నెరవేరలేదు. ఈ రోడ్‌లో జనం పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో పలు కథనాలు ప్రచురితం అయ్యాయి. కూటమి వచ్చి ఏడాది పూర్తయ్యాక ఈ రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. శుక్రవారం ఈ మార్గంలో కొత్తగా తారు రోడ్డు పునర్నించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు


మాజీ మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: నగర ప్రజలు శ్రీకృష్ణ జన్మాష్టమి పండగను సంతోషంగా జరుపుకోవాలని మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకృష్ణుని ఆశీస్సులు నగర పౌరులపై ఉండాలని ఆకాంక్షించారు.

భీమవరం బుల్స్ బేజారు

విశాఖ స్పోర్ట్స్ : ఏపీఎల్ నాలుగో సీజన్‌లో భాగంగా శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో జరిగిన రెండో మ్యాచ్‌లో భీమవరం బుల్స్‌పై తుంగభద్ర వారియర్స్ విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించగా తొలుత బ్యాటింగ్ చేసిన తుంగభద్ర వారియర్స్ 6 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసింది. జ్ఞానేశ్వర్ (24), ప్రశాంత్(40), కెప్టెన్ మహీప్‌కుమార్(41) రోహిత్ (24) బ్యాటింగ్‌లో రాణించగా.. సత్యనారాయణ రెండు,శివ, తేజస్వి, హేమంత్ ఒకో వికెట్ తీశారు. 152 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భీమవరం బుల్స్ 28 పరుగులకే ఆరు వికెట్లు చేజార్చుకుంది. ఈ దశలో శ్రవణ్‌కు సాత్విక్(43) తోడై స్కోర్‌ను 122కు చేర్చారు. చివరికి 18 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 138 పరుగులుతో ఇన్నింగ్స్ ముగిసింది. శ్రావణ్ 76 పరుగులతో నిలిచాడు. సౌరబ్ నాలుగు, శశికాంత్, స్టీఫెన్ చెరో రెండు వికెట్లు తీశారు. తొలుత వైఎస్సార్ స్టేడియంలో ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి సానా సతీష్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు.

వర్షంతో ఏపీఎల్ మ్యాచ్ రద్దు

రాయల్స్ రాయలసీమ- సింహాద్రి వైజాగ్ లయన్స్ మధ్య జరగాల్సిన తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. ఇరు జట్లకు ఒకో పాయింట్‌ను కేటాయించారు.


జాతీయ జెండాలను చేత బట్టి దేశభక్తి చాటుతున్న వానప్రస్థాశ్రమం వృద్ధులు


వాకర్స్ పార్కులో జెండా ఆవిష్కరిస్తున్న క్లబ్ అధ్యక్షుడు భానుప్రకాష్, తదితరులు


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో బహుమతులు సాధించిన విద్యార్థులు


వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న వైశాఖి స్పోర్ట్స్ ప్రతినిధులు

త్రివర్ణ శోభితం


సుభాష్ చంద్రబోస్, మదర్ థెరిసా వేషధారణలో చిన్నారులు(బర్మాకాలనీ పాఠశాల)

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలు, కార్మిక సంఘాలు సహా అన్ని ప్రాంతాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య పోరాట వీరుల త్యాగాలను స్మరించుకున్నారు.

25వ వార్డులోని మధురానగర్ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, 26వ వార్డులోని ఎన్జీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో కార్పొరేటర్ ముక్కా శ్రావణి జెండా ఎగురవేశారు. విద్యార్థుల ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనరస, జ్యోతి, పురుషోత్తమ, పీడీ సునంద్, ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. అక్కయ్యపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్, హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎన్.వి.విశ్వనాథం, పీడీ రత్నం, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. సీతంపేటలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ జెండా ఎగురవేశారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో కరస్పాండెంట్ జి. మధుకుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు సర్దార్ పాపారాయుడు వేషధారణలో అలరించారు.44వ వార్డులోని అబిద్‌నగర్ పార్కులో, సీతమ్మధార ప్రాంతానికి చెందిన కె.లిఖిత్ కుమార్ అల్లూరి సీతారామరాజు వేషధారణలో ఆకట్టుకున్నాడు.

దేశభక్తి నిండుగా మువ్వన్నెల జెండా పండగ

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో 79వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, పార్కులలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. మాధవధార, అల్లూరి సీతారామరాజునగర్, బర్మా కాలనీలోని పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి.వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైశాఖి స్పోర్ట్సు పార్కులో అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. వైశాఖి స్పోర్ట్సు పార్కులో నిర్వహించిన నడక, స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఇతర సభ్యులు పాల్గొన్నారు. వాకర్స్ పార్కులో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్‌ఎస్ ఎస్‌వీ ప్రసాదరావు, ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు. పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండా వందనం జరిగింది. మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.


51వ వార్డులో వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

ఎమ్మెల్యే కార్యాలయంలో..

తాటిచెట్లపాలెం: సీతమ్మధారలో గల నియోజకవర్గ బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నాయకులు నాగేంద్ర, శ్యామల దీపిక, సునీల్ అగర్వాల్, కార్పొరేటర్లు ఉషశ్రీ, కంపా హనోక్, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

51వ వార్డులో...

జీవీఎంసీ 51వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాధవనగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అంబేద్కర్ కాలనీ, ఆది ఆంధ్ర సేవా సంఘం, కనకదుర్గ ఆటో స్టాండ్, భీమనగర్ ఆది ఆంధ్ర సేవా సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జెండాలు ఆవిష్కరించి, మాట్లాడారు. పైడి శ్రీను, పొన్నాడ అప్పారావు, తిరుమలరావు, ప్రతాప్, లక్ష్మణ్, రాణి, వరహాలరాజు, శ్రీనివాస్, పైడిరాజు, ఎంఎస్‌ఆర్ పార్క్ అసోసియేషన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు


ధర్మానగర్‌లో జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సిద్దార్థ రాజు

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డులోని కంచరపాలెం ధర్మానగర్‌లో క్రాంతి యువజన ప్రగతి మండలి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు యడ్ల సిద్ధార్థ రాజు హాజరై జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షులు వై. శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌కుమార్, అధ్యక్షులు డి. అప్పారావు, శంకర్, భరత్, కరుణ, సూర్య పాల్గొన్నారు.


అక్కయ్యపాలెం జీవీఎంసీ హైస్కూల్‌లో జెండా ఎగురవేస్తున్న కార్పొరేటర్ శ్రావణి


స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న విష్ణుకుమార్‌రాజు


46వ వార్డులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

46వ వార్డులో..

జీవీఎంసీ 46వ వార్డులోని లక్ష్మీనారాయణపురం ప్రాథమిక పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పాల్గొన్నారు. ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లలితాంబ, ఉపాధ్యాయులు ఇందిరా, మేరీజ్యోత్స్న, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బలిరెడ్డి గోవిందరాజు, స్థానికులు కోటా రామారావు, కె. చిన్నా, ఎస్. కృష్ణ, ఎస్. రామారావు, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో..

సీతంపేట: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీతమ్మధారలో గల కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో దుర్గేష్ కుమార్ దూబే జాతీయ జెండా ఎగురవేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో జేఎన్‌పీఏ, కొచ్చిన్, పారాదీప్, ఎస్‌ఎంపీ కోల్‌కతా, వీపీఏ, ఈశాన్యంలోని ఇన్‌ల్యాండ్ డ్రెడ్జింగ్ పనులతో సహా ప్రధాన భారతీయ ఓడ రేవులలో కంపెనీ అనేక కీలక డ్రెడ్జింగ్ పనులను విజయవంతంగా నిర్వహించిందన్నారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


జెండా వందనం చేస్తున్న డీసీఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో దుర్గేష్ కుమార్ దూబే

ఘనంగా దేవమాత మోక్షారోపణ ఉత్సవాలు


దేవమాత పల్లకితో బిషప్ చర్చి ఫాదర్లు

కంచరపాలెం: జ్ఞానాపురంలో శుక్రవారం దేవమాత మోక్షారోపణ మహోత్సవం, 125 సంవత్సరాల జూబ్లీ ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించడానికి అనేక మంది భక్తులు సెయింట్ పీటర్స్ ప్రాంగణంలో పునీత పేతురు ప్రధాన దేవాలయానికి చేరుకున్నారు. దేవమాత మహోత్సవాన్ని పురస్కరించుకుని రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో విశాఖ అగ్ర పీఠాధిపతుల రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఉడుముల బాలశౌరి, విశ్రాంత అగ్ర పీఠాధిపతులు రెవరెండ్ మల్లవరపు ప్రకాష్ దివ్యబలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా పతాకావిష్కరణ, దివ్యపూజా బలి నిర్వహించారు. పీపీసీ అధ్యక్షుడు మునురు రాజేష్, ఫాదర్లు విమల్‌రాజ్, ప్రేమ్‌కుమార్, పరంజ్యోతి, బోగి సంజీవ్, లాము జయరాజు, సంఘాల ప్రతినిధులు శేషుబాబు, కమిటీ సభ్యులు ఫ్రాన్సిస్, మీసాల స్వర్ణలత, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షలతో మొక్కల ఏర్పాటు..

జ్ఞానాపురంలో జరుగుతున్న మరియమాత మోక్షరోపణ, 125 సంవత్సరాల జూబ్లీ మహోత్సవాలకు వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ రూ.1.50 లక్షలతో వార్డులోని పలు వీధుల్లో గల ఆర్చిలు, విగ్రహాల వద్ద మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కార్పొరేటర్ పూర్ణిమ తెలిపారు. వార్డు ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ, దేవమాత ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు.


దేవమాత విగ్రహం వద్ద మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

బంధువుల ఇంటికి చేరిన మహిళలు



మమత చారిటబుల్ ట్రస్టు అధినేత సహకారంతో బంధువుల ఇంటికి చేరిన మహిళలు

మురళీనగర్: పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ చేపట్టిన 'జ్యోతిర్గమయ' కార్యక్రమం ద్వారా ఇద్దరు నిస్సహాయ మహిళలు వారి కుటుంబ సభ్యులను కలుసుకోగలిగారు. ఈ మానవీయ ప్రయత్నంలో పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేశాయి. ఫుట్‌పాత్‌పై భిక్షాటన చేస్తూ కనిపించిన సజ్జ విజయను పోలీసులు గుర్తించారు. మమత చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ఎల్లేటి మమత సహాయంతో ఆమెకు మాతృప్రేమ వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. తర్వాత పోలీస్ కమిషనర్ సహకారంతో విజయను ఆమె కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. ఆమె ప్రస్తుతం మద్దిలపాలెం టీఆర్‌ఎం కాలనీలో నివసిస్తున్నారు. సింహాచలం దర్శనానికి వచ్చిన బిస్సాయి సంధ్య భర్త ప్రమాదంలో గాయపడటంతో దారి తప్పింది. ఆమె తన పదేళ్ల కొడుకుతో కలిసి ఫుట్‌పాత్‌పై ఉండగా..జ్యోతిర్గమయ వలంటీర్లు గుర్తించారు. వారికి మాతృప్రేమ వృద్ధాశ్రమంలో తాత్కాలికంగా ఆశ్రయం కల్పించి, తర్వాత వారి స్వస్థలం రామగుండంకు చేర్చడానికి ఏర్పాట్లు చేశారు. మానసిక చికిత్స పొందుతున్న మరొక మహిళను కూడా మాతృప్రేమ సంస్థ సహాయంతో ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అలరించిన కవితా గోష్ఠి


ప్రసంగిస్తున్న రమణమూర్తి

సీతంపేట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విశాఖ సాహితీ ఆధ్వర్యంలో 'స్వాతంత్ర్య స్ఫూర్తి' అనే అంశంపై అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో కవితాగోష్ఠి నిర్వహించారు. విశాఖ సాహితీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి సభాధ్యక్షత వహించారు. ఆకాశవాణి విశ్రాంత నిర్వహణాధికారి రామవరపు వెంకట రమణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుల గురించి ప్రసంగించారు. అనంతరం ప్రముఖ సాహితీ విశ్లేషకులు డాక్టర్ డి.వి.సూర్యారావు నిర్వహణలో జరిగిన కవితా గోష్ఠిలో సోమంచి వినయ భూషణరావు, భాగవతుల సత్యనారాయణమూర్తి, వేదుల వాసుదేవరావు, బేకి వీరబ్రహ్మం, పిళ్లా రమణమూర్తి, శుభం వర్మ, సీహెచ్ చినసూర్యనారాయణ మూర్తి, కొచ్చర్లకోట సత్యనారాయణమూర్తి, ఘంటికోట లక్ష్మి, దామరాజు విశాలాక్షి, దేవులపల్లి పద్మజ, రాధారాణి తదితరులు స్వీయ కవితా పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ సాహితీ సంయుక్త కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, పూర్వ కార్యదర్శి ఘంటికోట విశ్వనాథం పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత

అల్లిపురం: ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బ్యాగు మరిచిపోయి వెళ్లిపోయిన మహిళకు ఆమె బ్యాగును సురక్షితంగా పోలీసులు అప్పగించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీకి చెందిన పి.విజయలక్ష్మి శుక్రవారం సాయంత్రం ఎస్.రాయవరం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లారు. ఆమె బస్సు రాగానే బ్యాగు కుర్చీలో వదిలేసి బస్సు ఎక్కేశారు. అది గమనించిన ఆర్టీసీ సెక్యూరిటీ కానిస్టేబుల్ కేఎస్ కుమారి, డ్యూటీలో ఉన్న ఎస్ఎం సమక్షంలో టూటౌన్ కానిస్టేబుల్ కేపీ రాజుకు అందజేశారు. బ్యాగు దొరికిన విషయాన్ని విజయలక్ష్మి మనవడు కె. వాసుదేవరాజు తెలిపారు. కుటుంబ సభ్యుల సమక్షంలో టూటౌన్ క్రైం ఎస్ఐ సునీల్ బ్యాగు తెరిచి చూడగా బంగారం, రూ.3 వేల నగదు గుర్తించారు. బంగారం, డబ్బుతో సహా బ్యాగు ను వారికి అప్పగించారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు



బహుమతులు అందిస్తున్న సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణమూర్తి

మురళీనగర్: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతిక విద్యార్థులు కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నకుమార్ పాల్గొన్నారు.కళాశాలలోని వివిధ బ్రాంచీలలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు వింజమూరి విజయ మెమోరియల్ ట్రస్ట్ అధినేత వింజమూరి సుబ్బారావు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. అలాగే బీఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అదే విధంగా, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటరమణ జాతీయ జెండాను ఆవిష్కరించి, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

శ్రావణ శుక్రవారం.. ఆధ్యాత్మిక వైభవం



దాబాగార్డెన్స్: సకల సౌభాగ్యాలు ప్రసాదించే శ్రావణలక్ష్మి నామస్మరణతో నగరం మార్మోగింది. శ్రావణమాసపు పవిత్ర శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లల్లో అమ్మవారిని పూజించారు. బంగారు కాసులతో కొలిచారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారు స్వర్ణాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం నిర్వహించారు. 8.10 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర వాయిద్యాల మధ్య శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజలో పాల్గొన్న మహిళలకు డ్రా ద్వారా శ్రీలక్ష్మీదేవి వెండి ప్రతిమలు బహుమతిగా ఇచ్చారు. ఆలయ మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు, ఈవో శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని రజిత వస్త్రాలంకరణతో అలంకరించారు. వేకువజామున 5 గంటలకు మూలవిరాట్‌కు 108 ద్రవ్యాలతో ప్రత్యేక క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం 108 స్వర్ణపుష్పాలతో పూజ చేసి, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణంలో పాల్గొన్నారు. 250 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, ఇతర సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డబ్ల్యూసీఆర్‌పీ కార్యాలయం ప్రారంభం


వినియోగదారుల కమిషన్ జడ్జి తనూజా రెడ్డితో డబ్ల్యూసీఆర్‌పీ సభ్యులు

మురళీనగర్: వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ మురళీనగర్ శాఖను హరితా పార్కు వద్ద శుక్రవారం వినియోగదారుల కమిషన్ జడ్జి జి.తనూజా రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన డబ్ల్యూసీఆర్‌పీ చైర్మన్ డాక్టర్ రామానుజ స్వామి పాల్గొని మాట్లాడుతూ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తమ కార్యాలయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. సమస్యల పరిష్కారానికి వినియోగదారులకు సలహాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల కమిషన్ సభ్యులు కృష్ణమూర్తి, లీగల్ సెల్ అధ్యక్షుడు, అడ్వకేట్ జీహెచ్ రెడ్డి, డబ్ల్యూసీఆర్‌పీ సభ్యులు డి.దేముడు, ఆర్.బాబూరావు, బి.అప్పలరాజు, పెంటబాబు, మార్టిన్ ఫెరీరా, మంగ, ఈశ్వరుడు, రజనీకాంత్, సింహాద్రి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.